క్లుప్తంగా

డిజైర్ సొసైటీలో చిన్నారులకు పౌష్టికాహార కిట్లు



చిన్నారులకు పౌష్టికాహారం కిట్లు అందిస్తున్న కరణంరెడ్డి

గాజువాక : స్థానిక డిజైర్ సొసైటీలో ప్రత్యేక చిన్నారులకు కేఎన్నార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. హెచ్ఐవీ బాధిత పిల్లలకు మందులతో పాటు బలమైన ఆహారం అవసరమన్నారు. కార్యక్రమంలో డిజైర్ సొసైటీ మేనేజర్ లక్ష్మణ్, కేఎన్నార్ ఫౌండేషన్ సభ్యులు జ్యోతి, సాహితి, చిరు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు కోలా శ్రీనివాస్

పెదగంట్యాడ: మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక మండలం నాతయ్యపాలెనికి చెందిన కోలా శ్రీనివాస్ (53) జీవీఎంసీ నీటి సరఫరా విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి. ఆయనకు మతిస్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఇటీవల మెంటల్ కేర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ ఉదయాన్నే నిద్ర లేచి నడుచుకుంటూ ఇంటి నుంచి వెళ్లిపోతున్నాడు. శనివారం ఉదయం కూడా నాతయ్యపాలెం నుంచి నడుచుకుంటూ హౌసింగ్ బోర్డు కాలనీకి చేరుకున్న శ్రీనివాస్, అక్కడ కమ్యూనిటీ హాల్ ఎదురుగా ఉన్న టైలర్ దుకాణంలో రేకుల షెడ్డుకు ఉన్న పైప్‌కు తాడుతో ఉరిపోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉదయ్ కిరణ్ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారుల యోగా శిబిరానికి విశేష స్పందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న చిన్నారుల ఉచిత యోగ శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతోంది. నగరంలోని చిన్నారులు ఉత్సాహంగా ఈ శిబిరంలో పాల్గొని యోగాసనాలు వేస్తున్నారు. యోగా కేంద్రంలో సుశిక్షితులైన శిక్షకుల పర్యవేక్షణలో ఏకాగ్రతకు ఉపకరించే యోగాసనాలు నేర్పుతున్నట్లు కేంద్రం విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు తెలిపారు.

ప్రగతి మార్గాలు

డెవలప్‌మెంట్ వాచ్

రహదారులకు మహర్దశ పట్టింది. అధ్వాన స్థితిలో ఉన్న, గుంతలమయమైన రోడ్లకు మోక్షం కలిగింది. రాష్ట్రప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో నియోజకవర్గ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు కొత్త రూపును సంతరించుకున్నాయి. శివారు ప్రాంతాల్లోనూ ప్రయాణికులను రాచబాటలు స్వాగతిస్తున్నాయి.



అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం కూడలి నుంచి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి మీదుగా ఫార్మాసిటీ కాలనీ జంక్షన్ వరకు రెండు విడతల్లో రూ.72 లక్షలతో ఇరువైపులా విస్తరించిన రహదారులు



కూర్మన్నపాలెం: 86వ వార్డు రాసాలమ్మ కాలనీ రాజీవ్‌నగర్ మధ్య నుంచి వినాయకుడి గుడి వరకు రూ.18 లక్షలతో వేసిన రోడ్డు



కూర్మన్నపాలెం: 86వ వార్డు రాసాలమ్మ కాలనీ డాక్‌యార్డ్ సచివాలయం మీదుగా సాయిబాబా గుడి వరకు రూ.19 లక్షలతో వేసిన రోడ్డు



అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు మింది ఎస్‌బీఐ ఏటీఎం పక్కన రూ.36 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



పెదగంట్యాడ: 74వ వార్డు సిద్ధేశ్వరంలో రూ.3.88 కోట్లతో కొత్తగా నిర్మించిన డబుల్ రోడ్డు



గాజువాక: రూ.70 లక్షలతో నిర్మించిన గాజువాక బీసీ రోడ్

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి

- సంక్షేమ పాలన కొనసాగింపునకు సహకరించండి
- మంత్రి, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- 86వ వార్డులో ఎన్నికల ప్రచారం



86వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్

కూర్మన్నపాలెం: ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి తనను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. జీవీఎంసీ 86వ వార్డు దువ్వాడ – 2 గ్రామంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావు ఆధ్వర్యంలో అమర్‌నాథ్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా, పేదరికమే ప్రాతిపదికగా ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్నకు జనమే బలమన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలన చేరువ చేశారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు.

వైఎస్సార్‌సీపీలో జనసేన కార్యకర్తల చేరిక

దువ్వాడ సెక్టార్–2కు చెందిన జనసేన కార్యకర్తలు దామా సుబ్బారావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీలో చేరారు. వారికి అమర్‌నాథ్ పార్టీ కండువాలు వేసి, వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వీవీఎస్ఎం రాజా, పార్టీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాస్‌పట్నాయక్, చిట్టి దేవుడు, మాటూరి శ్రీనివాసరావు, నిర్మలమ్మ, భూపతిరాజు శ్రీనివాసరాజు, స్థానిక నాయకులు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



జనసేన కార్యకర్తలకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అమర్‌నాథ్

ఫిష్ ఆంధ్ర షాపు ఏర్పాటుకు ఆదేశాలు



రైతు బజారులో అధికారులకు సూచనలు ఇస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ప్రశాంతి

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజార్‌లో ఫిష్‌ఆంధ్రా, జనరిక్ మందులు అమ్మే షాపులను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ప్రశాంతి అధికారులకు సూచించారు. రైతుబజార్ ప్రాంగణంలో ఖాళీ ప్రదేశాన్ని వీటి కోసం వినియోగించుకోవాలన్నారు. గతంలో కూడా ఫిష్ ఆంధ్రా దుకాణం ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించామని అది త్వరలో ఏర్పాటు చేస్తామని అధికారులు ఆమెకు వివరించారు. ఇక్కడ ఉన్న ఆర్గానిక్ దుకాణాన్ని కూడా ఆమె పరిశీలించారు. రైతు బజార్‌లో వివిధ స్టాళ్లను పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఆర్‌జేడీ సుధాకర్, మార్కెటింగ్ డీడీ యర్రన్న, మార్కెటింగ్ అధికారి యాసిన్, ఈఓ నారాయణ రావు పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నేడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కేంద్రం గౌరవ సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి, తగిన సూచనలు చేయనున్నారు. రోగులు తమ వెంట ఆరోగ్య వివరాలు తెలిపే రిపోర్టులను తీసుకురావాల్సి ఉంటుంది. ఇతర సమాచారం కోసం 94401 91673 నంబరులో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి 'చెల్లుబోయిన' రాజీనామా



రాజీనామా లేఖను చూపిస్తున్న చెల్లుబోయిన నాయుడు

పెదగంట్యాడ: కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన నాయుడు ఆ పార్టీకి శనివారం గుడ్ బై చెప్పారు. ఆయన తన రాజీనామా విషయాన్ని పత్రికా ముఖంగా తెలియజేశారు. నాయుడు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారిని కాంగ్రెస్‌లో పట్టించుకోకపోవడంతో పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి, జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1178వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరు సాగిస్తామన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో జనసేన, టీడీపీ మహిళల చేరిక



మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 67వ వార్డుకు చెందిన జనసేన, టీడీపీకి చెందిన మహిళలు వైఎస్సార్ సీపీలో చేరారు. చట్టివానిపాలెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి అమర్‌నాథ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గాజువాక ఎన్నికల అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో లక్ష్మీ శాంతమ్మ, రమాదేవి, సరస్వతి, కనకవల్లి, రాణి, జ్యోతి, హేమ, రమణమ్మ, కుమారి, వరలక్ష్మి తదితరులున్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు.

వైఎస్సార్‌సీపీలో కాపులకు సముచిత స్థానం

- సీఎం జగన్ పాలనలో అన్ని రంగాల్లో ప్రాధాన్యం
- అమర్‌నాథ్‌ను గెలిపించుకుంటే అండగా ఉంటారు
- కాపుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి



కాపుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య

అక్కిరెడ్డిపాలెం: కాపు సామాజిక వర్గానికి వైఎస్సార్ సీపీ సముచిత స్థానం కల్పించిందని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారికి అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మిందిలోని గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం నిర్వహించిన కాపు సామాజిక వర్గం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లోనూ కాపులకు అధికంగా సీట్లు కేటాయించారన్నారు. గాజువాకలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించుకుని కాపుల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని కోరారు. గాజువాకలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన సుమారు 50 వేల మందికి పైగా కాపు సామాజిక వర్గం వారు ఉన్నారని, అందరూ ఐక్యతతో అమర్‌నాథ్‌ను గెలిపించుకుని గాజువాక అభివృద్ధికి సహకరించాలని కోరారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ఆత్మీయుడిగా ఉన్న అమర్‌నాథ్‌ను గెలిపించుకుంటే ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఆయనతో నేరుగా విన్నవించుకునే అవకాశం ఉంటుందని అన్నారు.

అమర్‌కు అండగా నిలవండి:గుడివాడ నాగమణి

అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి మాట్లాడుతూ అమర్‌నాథ్ గెలుపు కాపు కుటుంబ సభ్యుల గెలుపుగా భావించాలని కోరారు. 'గుడివాడ' కుటుంబీకులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, 68వ వార్డు పార్టీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు ఈటి శ్యామలరావు, ఈటి శ్రీరాములు, బోగాది సన్యాసిరావు, జి.వి.కృష్ణారావు, ఎస్.గోపాలరావు, సంధ్రాన నూకరాజు, నరికట్ల సూర్యనారాయణ, గొంతిన నూకరాజు, రెడ్డి జగన్నాథం పాల్గొన్నారు.

పోలీసు బలగాల కవాతు

పరవాడ: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు వీలుగా శనివారం వివిధ ప్రాంతాల్లో పోలీసులు, కేంద్రబలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. శాంతి యుతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలని సూచిస్తూ ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం, పెదముషిడివాడ, కన్నూరు, మడకపాలెం గ్రామాల్లో కవాతు నిర్వహించినట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

ప్రచార పర్వం



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరుతూ 69వ వార్డులో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు కాకి అప్పల రెడ్డి, దుర్గా రెడ్డి, వినోద్ రెడ్డి తదితరులు. - అక్కిరెడ్డిపాలెం



సీపీఎం అభ్యర్థి జగ్గునాయుడిని గెలిపించాలని కోరుతూ చైతన్య నగర్, మెహర్‌నగర్, ప్రశాంతినగర్, 60 అడుగుల రోడ్, ఆర్‌కే ఆస్పత్రి ఏరియాల్లో ప్రచారం చేస్తున్న సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్, నాయకులు జి.ఆనంద్, జె.రామకృష్ణ, విష్ణుమూర్తి తదితరులు - గాజువాక



74వ వార్డులో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారంలో భాగంగా వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సోదరి సురేఖ - పెదగంట్యాడ



స్టీల్‌ప్లాంట్ సెక్టార్-2 కాంప్లెక్స్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సాపే బ్రహ్మయ్య, వై.మస్తానప్ప, పుల్లారావు, సంపూర్ణం తదితరులు - ఉక్కునగరం



75వ వార్డు పెదకోరాడలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అమర్‌నాథ్ సతీమణి హిమగౌరితో కలసి ప్రచారం చేస్తున్న గొందేశి వెంకటరమణారెడ్డి - పెదగంట్యాడ



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా 73వ వార్డు సమతా నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ భూపతిరాజు సుజాత - పెదగంట్యాడ



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని కోరుతూ 76వ వార్డులో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకుడు దొడ్డి రమణ తదితరులు. - పెదగంట్యాడ



స్టీల్‌ప్లాంట్ సెక్టార్-1 కాంప్లెక్స్‌లో షాపు యజమానులను, వినియోగదారులను కలిసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్న పార్టీ 78వ వార్డు నాయకులు రావాడ శివ, ఎన్.రమేష్ కుమార్, అమ్మాజీ తదితరులు. - ఉక్కునగరం